క్లుప్తంగా

ఆలయంలో అన్నదానం

సిద్దవటం : మండలంలోని కనుములోపల్లె గ్రామ సమీపంలోని పర్వతగిరి దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మూడవ మంగళవారం సందర్భంగా అన్నదానం నిర్వహించినట్లు మాధవరం-1 గ్రామం యువకులు తెలిపారు. అంతకుముందు స్వామి వారికి అభిషేకం, అలంకరణతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు వీరయ్య జరిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు లక్షుమయ్య, భక్తులు పాల్గొన్నారు.

కోటలో శిల్ప సంపద అద్భుతం

సిద్దవటం : మండల కేంద్రంలోని మట్లిరాజుల కోటలో శిల్ప సంపద చాలా అద్భుతంగా ఉందని కడపలోని సెయింట్ జేవియర్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ రియాజ్, ప్రధానోపాధ్యాయుడు కె. మహేష్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను ఇక్కడి కోటను సందర్శనకు తీసుకొచ్చామన్నారు. కోటలోని ముఖద్వారా, మొదటి, రెండవ మండపాలను, శిల్ప సంపదను, పార్కును, శిలాశాసనాన్ని, మూతి విరిగిన నందిని, ఈద్గా తదితర కట్టడాలను విద్యార్థులకు చూపించామన్నారు.

తొలగించిన ఓట్లపై ఇంటింటి సర్వే చేయండి

పెనగలూరు : ఓటర్ల జాబితా సర్వే అనంతరం తొలగించిన ఓట్లపై ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనగలూరు మండలంలో 720 ఓట్లను తొలగించామని, ఆ ఓట్లపై తిరిగి ఇంటింటా సర్వే నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. తొలగించిన ఓట్లపై బీఎల్‌ఓల వారీగా జాబితాను అందజేశారు. తీసివేసిన ఓట్లు చనిపోయినవా లేదా షిఫ్టింగ్ అనే విషయాన్ని కూలంకశంగా సర్వేచేసి జాబితా అందజేయాలన్నారు. బీఎల్‌ఓలు ఎన్ని పనులు ఉన్నా ఆ పనులన్నింటినీ పక్కన పెట్టి ఈ జాబితాపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలి

సిద్దవటం : పక్కా గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం సిద్దవటం మండలంలోని శాఖరాజుపల్లె, ఉప్పరపల్లె, మాధవరం1, 2, 3 వార్డుల గ్రామ పంచాయతీలలోని జగనన్న కాలనీ లే ఔట్‌లను పరిశీలించి మాట్లాడారు. మోదీన్‌సాబ్‌పల్లెలోని జగనన్న కాలనీలో గృహాల పైనుంచి వెళుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేశామన్నారు. ఈయన వెంట హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ చెన్నయ్య ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

రాజంపేట రూరల్ : రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వాలని డీఎస్పీ వీకేఎస్ చైతన్య పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం సహారా ఇండియా మేనేజర్ వి.విశ్వనాథరెడ్డి సహకారంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ చైతన్య మానవత ప్రతినిధులతో కలిసి రక్తదాన శిబిరంను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవటం కోసం రక్తదానం చేయాలని కోరారు. దాదాపు 100 మందికి పైగా దాతలు రక్తం అందజేసినట్లు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీఎస్ రాజు, వైద్యులు ఆర్ఎంబీఆర్‌సీ మోహన్‌రెడ్డి, చంద్రకళతో పాటు సిబ్బంది సత్యసాయి లీలమ్మ, డీ నాగరాజు, చంద్రబాబు, మధుబాబు, సంస్థ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, చైర్మన్ తుంగా రమణారెడ్డి, కార్యదర్శి కే సురేష్‌బాబు, కేంద్ర కమిటీ సభ్యులు కాకర్ల రాముడు, ప్రతినిధులు బి.శ్రీనివాసులునాయుడు, ఎస్.శివరాజు, పీసీఎస్ మూర్తి, వై.నందకిషోర్‌గౌడ్, పీవీ రమణ, నాగాశేఖర్‌రెడ్డి, సి.చెంగయ్య, చెంగరావు, వెంకటరమణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోడోయాత్రను జయప్రదం చేసుకుందాం

రాజంపేట రూరల్ : జిల్లా కేంద్రమైన రాయచోటిలో 7వ తేదీ భారత్ జోడో యాత్రకు సంఘీబావంగా చేపట్టే పాదయాత్రను జయప్రదం చేసుకుందామని రాయచోటి నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ పూల భాస్కర్ కోరారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి 7వ తేదీకి సంవత్సరం అవుతుందని అందుకు సంఘీబావంగా చేస్తున్న ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

పాడి పరిశ్రమ వృద్ధికి కృషి చేయండి

రాయచోటి టౌన్ : పాడి పరిశ్రమ మరింత వృద్ధి చెందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పశుసంవర్ధకశాఖ డీడీ మాలకొండయ్య పశు వైద్యులకు సూచించారు. మంగళవారం రాయచోటి డివిజన్ పరిధిలోని పశు వైద్యులతో (ఏడీ) సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ బెనర్జీ, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు దిశానిర్దేశం ఉపాధ్యాయులే

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉపాధ్యాయులను సత్కరించిన స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు



సంబేపల్లె: రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



రైల్వేకోడూరు: సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



రాజంపేట: ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన దృశ్యం

నందలూరు (రాజంపేట) : ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఎంఈఓ నాగయ్య, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణలు అన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సర్వేపల్లి జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ నాగయ్య మాట్లాడుతూ నాణ్యమైన బోధన ద్వారా విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకొని పనిచేసే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయకుమారి మాట్లాడుతూ విద్యావృత్తికే ఆదర్శనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని, ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఉపాధ్యాయ సంఘ నేతలు కృపానందం, హరిప్రసాద్, లీలా కృష్ణయ్య, మహంకాలయ్యలు మాట్లాడుతూ నందలూరు మండలంలో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అమర్‌నాథ్, వెంకటసుబ్బయ్య, ఆనంద్, లక్ష్మీరాజ్యం, ఫాతిమా మున్నీసాలను ఘనంగా సత్కరించారు. అలానే అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశం ఉపాధ్యాయులేనని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి విద్యార్థికి విద్యకు ప్రాధాన్యత కల్పించేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని, ప్రతి ఒక్కరూ విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి విద్యను అందించి విద్యార్థులను ఉన్నత లక్ష్యాలకు చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు బాబు, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, మానవతా చైర్మన్ బాల సుబ్రమణ్యం, మానవతా అధ్యక్షులు రమణరావు, ప్రసాద్ యాదవ్, శివయ్య, మల్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు నవనీతలక్ష్మీ, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీరాములు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నవీన్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు.

పెనగలూరు : మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చక్రంపేట హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే పెనగలూరు, ఎస్ఆర్ పురం, నాయుడువారిపల్లి, కట్టావారిపల్లి, నల్లపరెడ్డిపల్లి హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చేసిన సేవలు గురించి విద్యార్థులకు వివరించారు.

రైల్వేకోడూరు : పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం వద్ద మంగళవారం ఎంఈఓ రామయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాక్రిష్ణ జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా పలు విద్యా సంస్థలు, విద్యాశాఖ కార్యాలయాల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ రామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సర్వేపల్లి రాధాక్రిష్ణ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగు జాడల్లో మనందరం నడవాలని సూచించారు. కార్యక్రమంలో సెకండ్ ఎంఈఓ సుందర్, ఉపాధ్యాయులు రమణ, కన్నప్ప, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : ఆదర్శ పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అజ్ఞానాంధకారాన్ని తొలగించి వారిని వెలుగులోకి తీసుకువెళ్లే వారే నిజమైన గురువులని అన్నారు. విద్యార్థుల జీవితాన్ని అజ్ఞానం నుండి విజ్ఞానం వైపునకు, చీకటి నుండి వెలుగు వైపునకు, మృత్యువు నుండి అమృతత్వం వైపునకు పయనింపజేసేవారు గురువులు అని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనం గురించి కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల స్టిబంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, దూడల సుధాకర్ యాదవ్, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తల్లెంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీవాణి విద్యానికేతన్ ఉన్నతపాఠశాల, మండల కేంద్రంలోని శ్రీరిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మరో కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని మంగళవారం ప్రభుత్వపాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

పుల్లంపేట : మండలంలోని టి కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సయ్యద్ సత్తార్ హుస్సేన్‌ను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తరువాత గురువే దైవంగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందన్నారు. గురువు ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు కృషి చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహకుమార్, ఎంఈఓ చక్రధర్ రాజు, నాగా తిరుమలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువులేనిదే విద్య లేదు – విద్యలేనిదే జ్ఞానం లేదు

రాయచోటి అర్బన్ : గురువు లేనిదే విద్యలేదని, విద్యలేనిదే జ్ఞానం లేదని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు నిర్మల్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సన్‌రైజ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు రామాంజనేయులు, రవి, హెడ్‌మాస్టర్ రెడ్డెప్పరెడ్డి, క్లబ్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్‌లను లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అలానే సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలువేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శివభాస్కర్ విచ్చేసి మాట్లాడారు. అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి విజ్ఞానజ్యోతిని వెలిగించే వాడే గురువు అన్నారు. గురువును సేవించి, గౌరవించడం మన సనాతన సాంప్రదాయం అన్నారు.

సిద్దవటం : మండలం కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం గురుపూజోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించామని ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులను ప్రధానం చేశామన్నారు. అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన ఫిజికల్ డైరెక్టర్ రెడ్డెమ్మను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

రాయచోటి టౌన్ : సమాజంలో అన్నింటి కన్నా గొప్ప స్థానం గురువుదే.. గురువు తరువాతే ఎవరికైనా దక్కుతుందని మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. మంగళవారం సర్వేపల్లె రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాల ఆవరణంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం మానవత అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

గాలివీడు : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల డీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ మిట్టపల్లి రజిత, కడప డీసీసీ బ్యాంక్ నోడల్ అధికారి గంటా నారాయణరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ సీ.వి.నారాయణరెడ్డిల అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయుడు కె.వెంకటశివారెడ్డి సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



రాయచోటి టౌన్: గురువులను సన్మానించిన మానవత సభ్యులు



రాయచోటి అర్బన్: సన్మానించిన గురువులతో లయన్స్‌క్లబ్ సభ్యులు



సిద్దవటం: ఉపాధ్యాయురాలు రెడ్డెమ్మను సన్మానించిన తోటి ఉపాధ్యాయులు



పెనగలూరు: సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దృశ్యం

• గురువులకు పురస్కారాలు

విద్యాపరంగా ఉపాధ్యాయులు చేసిన సేవలకుగాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి పలువుర ఎంపికయ్యారు. వీరిలో రామాపురం మండలం నుంచి రామచంద్ర, విశ్వనాథ్, వెంకట్రామిరెడ్డి, చిన్నమండెం జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న హఫీజుల్లా, పెనగలూరు మండలం నుంచి చక్రంపేట హైస్కూల్ హెచ్ఎం గోపాలకృష్ణ, రాజంపేట మండలం నుంచి చెర్లోపల్లె జడ్పీ హైస్కూల్‌కు చెందిన డీ.చెంగల్‌రాజు, మన్నూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన కే.పాపయ్య, మన్నూరు ఎంపీపీఎస్ స్కూల్‌కు చెందిన బీ.సుధాకర్, కొండ్లోపల్లె ఎంపీయూపీఎస్ స్కూల్‌కు చెందిన సోమశేఖర్, ఓబులవారిపల్లె మండలంలోని చిన్నఓరంపాడు జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పాణ్యం నారాయణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను మంగళవారం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ నుంచి పురస్కారాలను అందుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈఓ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న హఫీజుల్లా



డీ.చెంగల్‌రాజు, కే.పాపయ్య, బీ.సుధాకర్, సోమశేఖర్



ఫణీంద్రప్రసాద్



పాణ్యం నారాయణ



గోపాలకృష్ణ

ఆర్బీకే సిబ్బంది అందుబాటులో ఉండాలి

సిద్దవటం : పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చాలంటే ఎక్కడా బీడు భూములు లేకుండా వ్యవసాయ భూముల్లో పంటలను తప్పనిసరిగా సాగు చేయాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లె రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఏడీఏ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కియోస్క్ పనితీరు, ఎరువుల నిల్వలు, పలు రకాల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉండి వారు అన్ని రకాల సేవలు, ప్రభుత్వ ప్రయోజనాలు పొందేలా చూడాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎరువులకు సంబంధించి ప్రతి రశీదు రికార్డుల్లో ఉండాలన్నారు. ఎరువులను అందుబాటులో ఉంచడం వల్ల రైతుకూడా సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. అనంతరం కొమ్మనాయునిపల్లి రైతు వీరభద్రారెడ్డి పసుపు పంటను పరిశీలించి పంటలో ఈ- క్రాప్‌ను నమోదు చేశారు. ఇటీవల వర్షాలు బాగా కురిశాయని రైతులు ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోండి

పుల్లంపేట : మండల కేంద్రంలోని డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పుల్లంపేట డీసీసీబీ మేనేజర్ బాలన్ కోరారు. మంగళవారం పుల్లంపేటలోని బీపీ శేషయ్య సాంస్కృత పాఠశాలలో విద్యార్థులకు బ్యాంక్ సేవలు గురించి వివరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంక్ కమర్షియల్ బ్యాంక్‌లకు దీటుగా అన్ని సేవలు అందిస్తోందన్నారు. అతి తక్కువ రేటుకే లాకర్ సౌకర్యం కలదని, డిపాజిట్లపై అధిక వడ్డీ, బంగారు రుణాలు, ఇతరత్రా రుణాలను అందజేస్తున్నామన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి చివరి వరకు చిన్నారులకు ప్రత్యేక పొదుపు డిపాజిట్లు ఖాతాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు రూ. 20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీని సన్మానించారు. కార్యక్రమంలో క్యాషియర్ వీరదివ్య, కరీముల్లా, లోకేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

రాయచోటి అర్బన్ : విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శైలజ అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా నాకో, ఏపీ శాప్స్, డాప్ క్యూ, సిఎఫ్ఐ, పీసీఎస్ఎస్‌లతో పాటు అన్నమయ్య జిల్లా అధికారులు సంయుక్తంగా నిర్వహించిన రెడ్ రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నుండి నారాయణరెడ్డిపల్లె వరకు సాగిన రెడ్ రన్ కార్యక్రమంలో జిల్లాలోని పలుడిగ్రీకళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ రెడ్‌రన్‌లో మొటిస్థానాన్ని ఎన్.మీతూనాయక్ మొదటిస్థానాన్ని, ఎస్.మహమ్మద్ రెండవ స్థానాన్ని, నాగరాజు మూడవస్థానాన్ని దక్కించుకున్నారు. చిత్తూరు జిల్లా డీపీఎం లలిత, ప్రిన్సిపల్‌లు హైదర్‌వలి, రాధాక్రిష్ణ, శ్రీనివాసులు, స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగ భద్రత కల్పించండి

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం యానిమేటర్లకు ఉద్యోగ భద్రతను కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రెడ్డెప్ప డిమాండ్ చేశారు. తమ సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మంగళవారం యానిమేటర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానిమేటర్లకు 3 సంవత్సరాల వరకే ఉద్యోగం ఉండేలా విడుదల చేసిన కాలపరిమితి సర్క్యులర్ 64ను వెంటనే రద్దు చేయాలన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతికి తోడ్పడుతున్న 28 వేల యానిమేటర్ల కుటుంబాలు ప్రభుత్వం అనాలోచితంగా విడుదల చేసిన 64 సర్క్యులర్‌తో రోడ్డున పడతాయన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికైనా పాలకులు గుర్తెరిగి యానిమేటర్ల ఉద్యోగ కాలపరిమితి జీఓను వెంటనే రద్దుచేసివారికి ఉద్యోగభద్రత కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు పరంజ్యోతి, నాయకురాళ్లు క్రిష్ణమ్మ, కరీముల్లా, కన్యాకుమారి, చెన్నమ్మ, ప్రసన్నతోపాటు నాయకురాలు రాణి పెద్దఎత్తున యానిమేటర్లు పాల్గొన్నారు.

జన సంక్షేమమే జగనన్న సంకల్పం

- ప్రజల సంతోషాలే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



వ్యవసాయకూలీల సాదక బాధకాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : జన సంక్షేమమే జగనన్న సంకల్పమని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె మండలం కస్తూరి రాజుగారి పల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. చాగలగుట్టపల్లె, గంధంవాండ్లపల్లె, దేవలంపల్లె, గుర్రయ్యగారిపల్లె, కస్తూరి రాజుగారిపల్లె, హరిజనవాడలు, ఎత్తపువాండ్లపల్లె, బత్తినవాండ్లపల్లె, సిద్దకవాండ్లపల్లె, తురకపల్లె, పిచ్చిగుంట్లపల్లె, ఎగువబత్తిన వాండ్లపల్లెలలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శ్రీకాంత్ రెడ్డి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఆప్యాయంగా పలుకరిస్తూ, సమస్యలపై ఆరాతీసి వాటి పరిష్కారానికి చొరవ చూపారు. సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సుఖసంతోషాలే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మహిళల మోములో వెల్లివిరుస్తున్న ఆనందం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూత పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎదుట కస్తూరిరాజుగారిపల్లె గ్రామ మహిళలు స్పష్టం చేశారు. అనంతరం గ్రామ సమీపంలో పనిచేస్తున్న వ్యవసాయకూలీలతో ఆయన మాట్లాడారు. వారి సాధక బాధకాలను తెలుసుకున్నారు. కస్తూరి రాజుగారిపల్లె హరిజనవాడలో ఎమ్మెల్యేకు దళితులు ఘనంగా స్వాగతించారు. దళిత సంక్షేమానికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని తమకు ఏ ఒక్కరి సిఫార్సు లేకుండానే అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. ఫ్లోరింగ్ తదితర మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, సింగల్ విండో ప్రెసిడెంట్‌లు రామచంద్రారెడ్డి, ఎర్రంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సయ్యద్ అమీర్, పోలిరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మినారాయణ, శంకర్ నాయుడు, జగన్ మోహన్ రెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

జగన్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రులకు స్వర్ణయుగం వచ్చిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని దేవలంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డు రూ. 43 లక్షల నిధుల వ్యయంతో నిర్మించిన సమావేశపు భవనం, ప్రహరీగోడ నిర్మాణాలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులు డాక్టర్ రియాజ్ బేగ్, డాక్టర్ రఫీవుల్లాఖాన్, డాక్టర్ సుమలత, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ కీర్తిరెడ్డిలతో ఎమ్మెల్యే ఆరా తీశారు. చిత్తశుద్ధితో రోగులకు సేవలు అందించాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు.

గడప వద్దకే పాలన అందిస్తున్న సీఎం జగన్

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపంగా జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామం ఈడిగపల్లెలో సచివాలయ నూతన భవనాన్ని శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. అలానే అనంతపురం ఈడిగపల్లెలో రూ. 10 లక్షల నిధులతో పూర్తయిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

భూ హక్కు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు భూ రక్ష పత్రాలను అందిస్తున్న మోహన్‌రెడ్డి, అధికారులు

రామాపురం : జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గువ్వల చెరువు గ్రామ సచివాలయంలో మంగళవారం శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమంలో పాసు పుస్తకాలను లబ్దిదారులకు అందించారు. మాట్లాడుతూ భవిష్యత్తులో వివాదాలకు తావు లేకుండా సమగ్ర సర్వే చేసినట్లు స్పష్టం చేశారు. ప్రజలు తమ ఆస్తుల లావాదేవీలు గ్రామంలో కనిపించే విధంగా రిజిస్ట్రేషను చేసుకోవచ్చునని తెలిపారు. ఇటువంటి మంచి సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతోపాటు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, తహసీల్దార్ అరవింద్ కిషోర్, ఎంపీడీఓ హైదర్‌వలి, ఆర్‌ఐ రవికుమార్, పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరి, ముబారక్, శివయ్య, రమణ, ఫిరోజ్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.